సాక్షి వనపర్తి

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



..సంకటస్థితి

సోమశిల– సిద్దేశ్వరం గ్రామాల మధ్య నాలుగు నెలలుగా రాకపోకలు నిలిచిపోయాయి.

వివరాలు IIలో ▸



లీకేజీతో ఎగిసిపడి..

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీతో తాగునీరు ఎగజిమ్మాయి.

వివరాలు IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.2 /24.1

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం ఆకాశం తేలికపాటి మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రం మార్పు

కొత్తకోట: గురుకుల ప్రవేశ పరీక్షకు సంబంధించి వీపనగండ్ల సెంటర్‌ను కొత్తకోటకు మార్పు చేసినట్లు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి కొత్తకోటకు రావాల్సిందిగా ప్రిన్స్‌పాల్ దయాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న నిర్వహించే 5వ తరగతి ప్రవేశ పరీక్ష కొత్తకోటలోని పెబ్బేరు రోడ్డులో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు ఆటంకం కల్గిస్తే చర్యలు

వనపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు ఉద్దేశ పూర్వకంగా ఆటంకం కలిగిస్తే వారిపై పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ నాగేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీజన్‌లను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించకపోవడంతో ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారులకు నోటీసులు అందజేశారని తెలిపారు. సమ్మెలో భాగంగా ఆర్టీజన్‌లు, ఇతరులు ట్రాన్స్‌ఫార్మార్ లైన్‌ల వద్ద విద్యుత్ సరఫరాకు ఏదైన అంతరాయం కలిగిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

వనపర్తి క్రైం: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహిళా సమాఖ్య చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 6వ రోజుకు చేరుకుంది. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. పుట్టా ఆంజనేయులు, నిక్సన్, రాములు, దేవేందర్, కవిత పాల్గొన్నారు.

‘ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుపై మాట తప్పారు’

వనపర్తి: రూ.250 కోట్లతో విశ్వబ్రాహ్మణ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయిందని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర ఆచారి ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడేళ్లు కావస్తున్నా.. కార్పొరేషన్ విషయంపై ప్రభుత్వంలో ఉండే విశ్వబ్రాహ్మణులైన ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయంపై మాట్లాడకపోవటం శోచనీయమన్నారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల జనాభా ఉన్న మాపై ప్రభుత్వం ఎందుకు ద్వంద వైఖరి ప్రదర్శిస్తోందని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలైన విశ్వబ్రాహ్మణులు కనీసం ఉండేందుకు సొంతిల్లు లేక దీనస్థితిలో జీవిస్తున్నారన్నారు. విశ్వబ్రాహ్మణుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. కౌన్సిలర్ బ్రహ్మం, మాధవాచారి, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్–ఉల్–ఫితర్

- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు



జిల్లాకేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

వనపర్తి క్రైం: జిల్లా వ్యాప్తంగా రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్) వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి ప్రార్థనలతో ముగించారు. నెలవంక కనిపించడంతో పండుగ జరుపుకొన్నారు. ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ చదివి వినిపించి, ప్రార్థనలు చేయించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ప్రముఖులు రంజాన్ వేడుకల్లో పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, మాజీ మంత్రి చిన్నారెడ్డి, బీజేపీ, టీడీపీ, అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటీ శ్రీధర్, మార్కెట్‌యార్డు చైర్మెన్ రమేష్‌గౌడ్, కౌన్సిలర్ సమద్, లతీఫ్, మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కిరణ్‌కుమార్, అఖ్తర్, అనీస్, ఖమ్మర్ మియా, ఎండి.బాబా, బీజేపీ నాయకులు కృష్ణ, ఆర్.వెంకటేశ్వర్ రెడ్డి, టీడిపి నాయకులు నందిమల్ల అశోక్, వెంకటయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



మాజీ మంత్రి చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకుల పండుగ శుభాకాంక్షలు



జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, బీజేపీ నాయకులు

ఎట్టకేలకు కదలిక



పెబ్బేరులో వెలసిన అనధికార లేఅవుట్

- ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు
- మూడేళ్ల తర్వాత క్రమబద్ధీకరణవైపు అడుగులు
- జిల్లాలో పెండింగ్‌లో 47,846 దరఖాస్తులు
- బల్దియాలకు భారీగా సమకూరనున్న ఆదాయం

జిల్లా వివరాలిలా..

మున్సిపాలిటీ	ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు
వనపర్తి	28,763
కొత్తకోట	7,580
పెబ్బేరు	7,242
ఆత్మకూర్	3,812
అమరచింత	449

పెబ్బేరు: దాదాపు మూడేళ్ల తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు కదలిక వచ్చింది. ఆయా మున్సిపాలిటీల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తులో పేర్కొన్న స్థలాలను పరిశీలించాలంటూ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇదిలాఉండగా, అనుమతి లేకుండా చేసిన లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వాటిని క్రమబద్ధీకరించుకోవాలని 2020 దరఖాస్తుల పరిశీలనపై జీఓ నెం.131 విడుదల చేసింది. నిబంధనల మేరకు ఉన్న స్థలాలను రెగ్యులరైజ్ చేయడానికి అనుమతులు జారీ చేసింది. దీంతో భారీ స్పందన వచ్చింది. వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు బాగానే ఉన్నా.. దరఖాస్తుల పరిశీలన మాత్రం అటకెక్కింది. దాదాపు మూడేళ్లుగా వాటిని క్రమబద్ధీకరించలేదు. తాజాగా ప్రభుత్వం వీటిని పరిశీలించాలంటూ కలెక్టర్లకు ఆదేశాలివ్వడంతో కదలిక మొదలైంది.

47,846 దరఖాస్తులు

మున్సిపల్ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన, లేఅవుట్ ఆమోదం పొందని వెంచర్లలో కొనుగోలు చేసిన స్థలాలను రెగ్యులరైజ్ చేయడం కోసం ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టగా జిల్లాలోని ఐదు మున్సిపాలిటీ నుంచి 47,846 దరఖాస్తులు వచ్చాయి. మీ సేవా కేంద్రాలు, వ్యక్తిగత మొబైల్ యాప్‌ల ద్వారా వీటిని నమోదు చేశారు. దరఖాస్తు ఫీజు కింద రూ. వెయ్యి చొప్పున వసూలు చేశారు. ఈ లెక్కన రూ. 4,78,46,000 ఆదాయం వచ్చింది. దరఖాస్తులు స్వీకరించినా ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు లేకపోవడంతో క్రమబద్ధీకరణ అంశం ముందుకుసాగలేదు. దీనికితోడు కొత్త పురపాలికల్లో పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది లేని కారణంగా వాటి పరిశీలిన నిలిచిపోయింది. తాజాగా తాత్కాలిక సాంకేతిక సహాయకులతో వీటి పరిశీలన చేపట్టాలంటూ ఆదేశాలు వచ్చాయి.

నిబంధనల మేరకు అనుమతులు



జీఓలో సూచించిన విధంగా ఇద్దరు సాంకేతిక సహాయకులను నియమించుకోవాల్సి ఉంది. కలెక్టర్ ఆదేశాల ప్రకారం వీరి నియామకానికి ప్రయత్నిస్తున్నాం. దరఖాస్తుల పరిశీలిన నెల రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యం విధించారు. నిబంధనల మేరకు ఉన్నవాటికి మాత్రమే అనుమతులు దక్కుతాయి. – ఆదిశేషు, కమిషనర్, పెబ్బేరు

టీపీఓలకు పరిశీలన బాధ్యతలు

ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో ప్రణాళికా విభాగంలోని టీపీఓ, టీపీబీఓ, టీపీఎస్‌లు పరిశీలించాల్సి ఉంటుంది. ప్రతీ దరఖాస్తును క్షేత్రస్థాయిలోకి వెళ్లి స్థలాన్ని చూశాకే నిర్ణయం తీసుకోవాలి. పరిశీలించిన వాటికి కమిషనర్ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. వీటి పరిశీలినలో గ్రీన్ జోన్, రైల్వేలైన్, చెరువులు, కుంటలు ఉన్న స్థలాల్లో ప్లాట్లు ఏర్పాటు చేశారా అన్నది స్పష్టంగా తెలియజేయాలి. వీటికి అనుమతులు ఇవ్వకూడదు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్లాటు ఉంటే కొలతలు, రిజిస్ట్రేషన్ సమయంలో మార్కెట్ విలువ వంటి వాటిని పరిశీలించాలి. జిల్లాకు ఒక్కరే టీపీఓ ఉండటం, లెక్కకు మించి దరఖాస్తుల్ని పరిశీలించడంపై సాధ్యాసాధ్యాలను అధికారులు అంచనా వేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఇద్దరు టీపీఎస్‌లను ప్రతి పురపాలికకు తాత్కాలికంగా నియమించు కోవాలన్నప్పటికీ పరిశీలన ఎలా అన్నది సందేహంగా మారనుంది. వీటిలో ఇప్పటికే ప్రస్తుత మార్కెట్ అంచనాల ప్రకారం 14 శాతం అదనపు పన్నులతో అనుమతులు పొంది నిర్మాణాలు చేసుకున్నవి కూడా లేకపోలేదు.

పునర్ విచారణ..

- డబుల్ బెడ్‌రూం ఇళ్ల అర్హులను గుర్తించడమే లక్ష్యం
- 24నుంచి 27వరకు ఇంటింటి వెళ్లి ఆరా తీయనున్న వైనం
- రంగంలోకి 20బృందాలు

వనపర్తి టౌన్: వనపర్తి పురపాలిక పరిధిలో 33వార్డుల్లో అర్హులైన నిరుపేదలకు 543 డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించేందుకు రీ వెరిఫికేషన్ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఈ నెల 24 నుంచి 27వరకు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మండల స్థాయి అధికారులను 20 బృందాలుగా విభజించారు. ఈ బృందాలు అర్జీదారుల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు, రేషన్ కార్డులు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఎవరైన వికలాంగులు ఉంటే అందుకు సంబంధించిన సదరం సర్టిఫికెట్లను సైతం పరిశీలించనున్నారు. మొత్తం 3,505 అర్జీలు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రాగా మున్సిపల్ అధికారులు గత ఏడాది సెప్టెంబర్ 29 నుంచి ఈఏడాది జనవరి 15వరకు ఇంటింటి సర్వే నిర్వహించి 2,066 మంది అర్హులు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపగా ఆధార్ కార్డు ప్రామాణికంగా గతంలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారులు, ఇల్లు ఉన్న వారి పేర్లు, కారు, ఇతర వాహనాలను చూపుతూ.. 1,428 మందిని అర్హులుగా చూపుతూ మిగతా వారిని అనర్హత జాబితాలో ప్రకటించారు.

అర్హులను అనర్హులుగా గుర్తించారంటూ..

ఇదిలాఉండగా, అనర్హత జాబితాలో చాలా మంది అర్హులు ఉన్నారని, మున్సిపల్ అధికారుల సర్వేపై అనుమానాలు ఉన్నాయని అధికార పార్టీ పాలకపక్షమే ఏకోన్ముఖంగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు ఈనెల 11న వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ అసలైన అర్హులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల దరఖాస్తు దారులందరినీ మండలాల బృందాలతో ఇంటింటికి తిరిగి రీ వెరిఫికేషన్ చేసేలా ఆదేశాలు జారీ చేసినట్లు వనపర్తి తహసీల్దార్ రాజేందర్‌గౌడ్ తాజాగా ఒక ప్రకటనలో తెలిపారు. రీ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత లక్కీడిప్ ద్వారా 543 మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. మూడు చక్రాల వాహనం ఉన్న దివ్యాంగులను సైతం జాబితాలో అనర్హులుగా ప్రకటించారు. ఇలాంటి వారి పట్ల మానవీయ కోణంలో ముందుకెళ్లాలని కలెక్టర్ మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు అధికార యంత్రాంగం చెబుతుంది. కొందరు మున్సిపాలిటీ, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వారి పేర్లు సైతం జాబితాలో అనర్హులుగా పడ్డాయి, అలాంటి వారిపై ఎలా ముందుకెళ్లారనేది స్పష్టత కొరవడింది. అదేవిధంగా కొన్ని చోట్ల గతంలో అమాయకుల ఆధార్ కార్డుల ద్వారా ఇళ్లు లేనివారి ఆధార్ కార్డులను వినియోగించుకొని మోసకారులు ఇందిరమ్మ లబ్ధి పొందారని ఇప్పటికీ అసలు ఇళ్లు లేని తమకు జాబితాలో ఇందిరమ్మ లబ్ధి పొందినట్లు ఉందని ఆందోళన చెందుతున్నారు. అలాంటి వాటి పై అధికారులు ఎలా స్పందిస్తారో ఆసక్తిగా మారింది.

తరుగు తీస్తే మిల్లర్ల లైసెన్స్‌లు రద్దు

వనపర్తి/కొత్తకోట రూరల్: కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వెళ్లే ట్రక్‌లోని ధాన్యంలో తరుగు తీయవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చామని, ఎవరైనా తరుగు తీస్తే వారి లైసెన్స్‌ను రద్దు చేయిస్తామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వనపర్తి మండలంలోని రాజపేట, పెద్దమందడి మండలంలోని అల్వాల, చిన్నమందడి, పామిరెడ్డిపల్లి, బలిజపల్లి, జంగమాయపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల ఎకరాలలో వరిసాగు చేశారని, సుమారు 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందనే అంచనాతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు తేమ శాతం, తరుగు పేరుతో ఇబ్బందులు పెట్టవద్దని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా రైతుబంధు అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, రాజనగరం పీఏసీఎస్ రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయంతోనే సమాజ పరిరక్షణ

వనపర్తి టౌన్: జనజీవన స్రవంతిలో న్యాయమనే మాటకు వెలకట్టలేని విలువ ఉందని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. వనపర్తి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కమిటీ సభ్యులందరినీ జిల్లా కేంద్రంలోని రేడియంట్ పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయాన్ని పరిరక్షించేందుకు న్యాయవాదులు, కోర్టులు చొరువ చూపుతున్నందుకే సమాజంలో విధ్వంసకారులకు, అక్రమాలకు పాల్పడే వారికి అవినీతి పరులకు భయం కలుగుతుందని, ఈ భయం రెట్టింపు కావాలంటే న్యాయం పేదలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు న్యాయం వైపు నిలవాలని అలాంటి న్యాయవాదులకు సమాజంలో శాశ్వతంగా గుర్తింపు ఉంటుందన్నారు. సామాన్య ప్రజలు న్యాయం దొరుకుతుందంటే వందల కిలోమీటర్లు అయిన వెళ్లడానికి సిద్ధంగా ఉంటారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. న్యాయవాదుల గౌరవాన్ని పెంచేలా ముందుకు సాగుతామని చెప్పారు. చిన్నమ్మథామస్, కవి జనజ్వాల, ఎస్. చంద్రశేఖర్, న్యాయవాదులు డి. కృష్ణయ్య, అనంతరాజు, పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ..

వనపర్తి క్రైం: పెరుగుతున్న భూతాపం, వాతావరణ కాలుష్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో అవగాహన పెంచి అంతరించిపోతున్న జీవజాతులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ అన్నారు. అంతర్జాతీయ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అవకతవకలకు చెక్

ఇకపై ముఖ గుర్తింపుతో తరగతిలో విద్యార్థుల హాజరు

- అటెండెన్స్‌తోనే మధ్యాహ్న భోజనం లెక్కింపు
- సమాచారమంతా సమగ్ర శిక్ష పోర్టల్‌లో నిక్షిప్తం
- ఇప్పటికే డీఈఓ కార్యాలయాలకు చేరిన ట్యాబ్‌లు
- క్షేత్రస్థాయిలో పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు



నారాయణపేటలోని డీఈఓ కార్యాలయానికి చేరిన ట్యాబ్‌లు

నారాయణపేట: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల సమస్త సమాచారాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు సమగ్ర శిక్ష పోర్టల్‌లో నిక్షిప్తం చేయనున్నారు. ప్రస్తుతం విద్యార్థుల అటెండెన్స్‌ను రిజిస్టర్‌లో చేస్తుండగా.. ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ అమ లు చేస్తున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలకు రోజు ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారనే విష యాన్ని కచ్చితంగా తెలుసుకునేందుకు ఇకపై ఫేస్ రికగ్నిషన్ అనే విధానాన్ని తీసుకువస్తుండటంతో క్షేత్రస్థాయిలో విద్యావ్యవస్థ పటిష్టమవుతుందని చెప్పవచ్చు. 2023– 24 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ముందుగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలు చేయాలని సర్కారు భావిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఉ మ్మడి జిల్లాలోని నారాయణపేట, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ విద్యా శాఖ కార్యాలయాలకు ఇటీవలే ట్యాబ్‌లు చే రుకున్నాయి. త్వరలోనే ఆయా జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు పంపిణీ చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అటెండెన్స్‌లో వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫేషియల్ రికగ్నిషన్ అనే కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ఈ విధానంతో ప్రతిరోజు ఫిజికల్ అటెండెన్స్ రిజిస్టర్‌లో చోటు చేసుకుంటున్నా.. అవకతవకలను నివారించడానికి ఉపాధ్యాయులు వారు పనిచేస్తున్న స్కూల్ తరగతి గది నుంచే విద్యార్థుల అటెండెన్స్‌ను ఫేషియల్ రికగ్నిషన్‌తో వేయాల్సి ఉంటుంది. పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడానికి ముందే టీచర్ల ఫొటోలను సెల్ఫీ ద్వారా తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేసి వారి ఐడీ నంబర్ పనిచేస్తున్న స్కూల్, దాని యూడైస్ కోడ్ నంబర్ తదితర వివరాలన్నింటినీ ఫీడ్ చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల ప్రవేశాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, పాఠశాలలో మౌలిక వసతులు, ఫొటోలు, ఉపాధ్యాయుల నివేదికలు, విద్యార్థుల ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తారు. చైల్డ్ ఇన్ఫో లాంటి సమాచారం ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ చేస్తారు. యూజర్ లాగిన్ పాస్‌వర్డ్, ఒకవేళ మరిచిపోతే రీసెట్ చేసే ఫెసిలిటీ కల్పించనున్నట్లు తెలుస్తోంది.

లొసుగులను సవరించడానికి..

విద్యాశాఖ హెడ్‌తో ఉన్న సత్సంబంధాలతో కొంతమంది టీచర్లు పాఠశాలకు విద్యార్థులు రాకపోయినా వచ్చినట్లు మధ్యాహ్న భోజన లెక్కల్లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. మ్యానువల్ అటెండెన్స్ విధానంలో ఉన్న లొసుగులను సవరించడానికి ఫేషియల్ రికగ్నిషన్‌ను తీసుకువచ్చింది. ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానం చేసి తరగతి గది నుంచి క్లాస్‌లోని విద్యార్థులందరి హాజరు పడనుంది. ఇలాగే రోజువారి అటెండెన్స్ నేరుగా విద్యాశాఖకు చేరనుంది. ఈ విధానంతో టీచర్లలో జవాబుదారీతనాన్ని పెంచడంతో పాటు విద్యార్థుల ఫిజికల్ హాజరు కనిపిస్తోంది.

తీరనున్న ఇబ్బందులు..

ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు త్వరలోనే ట్యాబ్‌లను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తుంది. ఈ ట్యాబ్‌లతో ఉపాధ్యాయులకు సైతం ఇబ్బందులు దూరం కానున్నాయి. ఇది వరకు మొబైల్‌తో ఫొటో తీసి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో నెట్‌వర్క్ సమస్యలు ఎదురయ్యేవి. ప్రభుత్వం పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేయడంతో ఉపాధ్యాయులు పాఠశాల, విద్యార్థుల వివరాల నమోదుతో పాటు ఫొటోలను సమగ్ర శిక్ష పోర్టల్‌లో సులువుగా పొందుపరచనున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు వచ్చిన ట్యాబ్‌ల వివరాలు

నారాయణపేట జిల్లా..	
ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు	379
వచ్చిన ట్యాబ్‌లు	449
జోగుళాంబ గద్వాల జిల్లా..	
ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు	356
వచ్చిన ట్యాబ్‌లు	435
మహబూబ్‌నగర్ జిల్లాలో..	
ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు	613
వచ్చిన ట్యాబ్‌లు	650
నాగర్‌కర్నూల్ జిల్లా..	
ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు	588
వచ్చిన ట్యాబ్‌లు	609
వనపర్తి జిల్లా..	
ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు	366
వచ్చిన ట్యాబ్‌లు	378

శిక్షణ ఇస్తాం..




ఇకపై విద్యార్థుల హాజరు పకడ్బందీగా ఉండనుంది. పీఎస్, యూపీఎస్‌లకు ట్యాబ్‌లను పంపిణీ చేసి ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ ఇస్తాం. ఆ ట్యాబ్‌లలో తరగతుల వారీగా విద్యార్థుల ఫొటోలతో పాటు వివరాలను పొందుపరుస్తారు. తరగతి గదిలో ఒకేసారి ఫేస్ రికగ్నిషన్‌తో హాజరు పడుతుంది. – శ్రీనివాస్, సెక్టోరల్ అధికారి, నారాయణపేట


సంగమేశ్వరుడికి సంకటస్థితి

భక్తులను దూరం చేసిన భుక్తి

- సోమశిల–సిద్దేశ్వరం ఘాట్ల నిర్వాహకుల మధ్య గొడవే కారణం
- నాలుగు నెలలుగా రెండు ప్రాంతాల మధ్య నిలిచిన బోటు ప్రయాణాలు
- రాకపోకలకు ఇబ్బందిపడుతున్న సాధారణ ప్రజలు
- మరో రెండు నెలలు మాత్రమే సంగమేశ్వరున్ని దర్శించుకునే అవకాశం



సంగమేశ్వరాలయం



సంగమేశ్వరాలయంలోని వేపలింగం

కొల్లాపూర్: రెండు గ్రామాల మధ్యన నెలకొన్న పంచాయితీ చిలికిచిలికి గాలివానగా మారింది. వారి మధ్యన నెలకొన్న వివాదం వేలాది మందిని ఇబ్బందుల పాలుచేస్తోంది. దశాబ్దాలుగా రెండు ప్రాంతాల మధ్య ఉన్న సత్సంబంధాలకు ఇప్పుడు బీటలు వారాయి. సోమశిల–సిద్దేశ్వరం గ్రామస్తుల మధ్య తలెత్తిన వివాదం కారణంగా నిత్యం నదీప్రయాణాలు సాగించే సామాన్య ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. సంవత్సరంలో ఐదు నెలలు మాత్రమే కనిపించే సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకునేందుకు తెలంగాణ ప్రాంత భక్తులకు ఇబ్బందికరంగా మారింది.

ఇదీ పంచాయితీ..

సోమశిల–సిద్దేశ్వరం గ్రామాల మధ్యన ఉన్న కృష్ణానది మీదుగా ప్రజలు దశాబ్దాల కాలంగా రాకపోకలు సాగిస్తున్నారు. పుట్టీలు నడిపే కాలం నుంచి మరబోట్లు వచ్చే వరకు రెండు గ్రామాలకు చెందిన తెలుగు కులస్తులు పరస్పర సహకారంతో ప్రయాణికులను తరలించేవారు. సోమశిలకు చెందిన వారు బోటుపై ప్రయాణికులను సిద్దేశ్వరం తీసుకువెళ్లి, తిరిగి అక్కడి ప్రయాణికులను సోమశిలకు తీసుకువచ్చేవారు. రవాణా చార్జీల్లో కొంత భాగాన్ని సిద్దేశ్వరం ఘాట్ నిర్వాహకులకు చెల్లించేవారు. నది దాటించే పని(ఘాట్ల నిర్వహణ) కోసం గ్రామాల్లో తెలుగు కులస్తులు మాత్రమే ప్రతి ఏడాది అరాజు(వేలం) పెట్టుకుంటారు. ఆ సొమ్మును సంఘ సభ్యులు వాటాలుగా పంచుకుంటారు. ఇది సుదీర్ఘకాలం సాగింది. అయితే సంగమేశ్వర ఆలయానికి విస్తృత ప్రచారం రావడం, వేలాదిగా తెలంగాణ ప్రాంత భక్తులు అక్కడి వెళ్తుండటంతో ఘాట్ల నిర్వాహకుల మధ్య వివాదాలు తలెత్తాయి. కొన్నేళ్లుగా సోమశిల ఘాట్ నుంచి ప్రయాణికులను నేరుగా సంగమేశ్వరం ఆలయం వద్దకు తీసుకువెళుతున్నారు. అక్కడి నుంచే రాయలసీమకు చెందిన ప్రయాణికులను సోమశిలకు తీసుకువస్తున్నారు. దీనిపై సిద్దేశ్వరం గ్రామస్తులు అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రయాణికులను సిద్దేశ్వరం గ్రామం వద్ద దించకుండా, కొంతకాలంగా ఆలయం వద్ద దించుతుండడంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. గతంలో మాదిరిగానే సోమశిల–సిద్దేశ్వరం గ్రామాల మధ్యనే ప్రయాణాలు కొనసాగించాలని, సంగమేశ్వరం ఆలయానికి వచ్చే భక్తులను తాము ఆటోల ద్వారా దేవుని దర్శనానికి తీసుకువెళ్తామని చెబుతున్నారు. ఇందుకు సోమశిల ఘాట్ నిర్వాహకులు ఒప్పుకోకపోవడంతో పంచాయితీ తలెత్తింది. దీంతో రెండు ప్రాంతాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. ఇరువర్గాలను రెచ్చగొట్టడంతో సోమశిల, సిద్దేశ్వరం గ్రామస్తులు ఓసారి నదిలో బోట్లలో ప్రయాణిస్తూనే దాడులు చేసుకునేందుకు ప్రయత్నించారు.

అధికారుల వద్దకు పంచాయతీ..

రెండునెలల క్రితం ఈ పంచాయితీ పోలీసుల వద్దకు చేరింది. నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసు అధికారులు, నంద్యాల జిల్లా పోలీసులు చర్చలు జరిపారు. బోటు ప్రయాణాలకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేనందున రెండు ప్రాంతాల నుంచి బోటు ప్రయాణాలు నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. బోట్లు తిప్పాలనుకుంటే సోమశిల గ్రామస్తులు ఏపీలోని అటవీ, నీటి పారుదల శాఖల అనుమతి తీసుకోవాలని, సిద్దేశ్వరం, సంగమేశ్వరం గ్రామస్తులు కూడా ఇదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో ఇరువర్గాలు రాజీమార్గాన్ని అనుసరించాలని అనధికారికంగా సూచించారు. దీనికి రెండువర్గాలు ఒప్పుకోలేదు. ఈ కారణంగా నాలుగు నెలలుగా కృష్ణానది గుండా రెండుప్రాంతాల మధ్య రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి.

ప్రయాణికులపై దూరభారం..

నదీ ప్రయాణాలు నిలిచిపోవడంతో సంగమేశ్వరున్ని దర్శించుకునేందుకు తెలంగాణ ప్రాంత భక్తులు కర్నూల్, నంద్యాల, ఆత్మకూరు మీదుగా 150 కి.మీకి పైగా దూరం ప్రయాణించి దేవున్ని దర్శించుకోవాల్సి వస్తోంది. ఇక బంధువులను చూసేందుకు, ఇతర పనుల కోసం వెళ్లాలన్నా అదే పరిస్థితి నెలకొంది. నదికి అవతలివైపున రాయలసీమ ప్రాంతాల్లో ఉండే ప్రజలు కూడా కొల్లాపూర్‌తో పాటు, ఉమ్మడి పాలమూరు జిల్లాకు వచ్చేందుకు వంద కిలోమీటర్లకి పైగా ప్రయాణం చేసి వస్తున్నారు. రాయలసీమ ప్రాంతవాసులు ప్రతి ఆదివారం నాగినోనిపల్లి మైసమ్మను దర్శించుకునేందుకు, బుధవారం సింగోటం పశువుల సంతకు వందలాదిగా వస్తుంటారు. వారికి కొల్లాపూర్‌లో బంధుత్వాలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. బంధువులను చూసేందుకు కూడా చుట్టూ తిరిగి రావాల్సివస్తోందని వారు వాపోతున్నారు. అధికారులు చొరవ చూపి ఈసమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు



సోమశిల వద్ద మరబోట్లలో ఎక్కుతున్న ప్రయాణికులు (ఫైల్)

రాయలసీమలోని కర్నూల్ జిల్లా ప్రజలకు, తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు మధ్య దశాబ్దాల కాలంగా బంధుత్వ, ఆధ్యాత్మిక సంబంధాలు ఉన్నాయి. సోమశిల, మంచాలకట్ట, వెల్టూరు తదితర ప్రాంతాల్లో కృష్ణానది మీదుగా మరబోట్లలో రాకపోకలు చేస్తారు. నాలుగు నెలలుగా రెండు ప్రాంతాల మధ్య మరబోట్ల ప్రయాణాలు నిలిపివేయడంతో ఇరుప్రాంతాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. చేపల వేటకు వినియోగించే పుట్టీల ద్వారా స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీఐపీలు వచ్చినప్పుడు మాత్రమే రెండు ప్రాంతాల పోలీసు అధికారుల అనుమతులతో మరబోట్లను తిప్పుతున్నారు.

అధికారులు స్పందించాలి..



సప్తనదీ సంగమ ప్రాంతం సంగమేశ్వరం. కృష్ణానదిలో నీటిమట్టం తగ్గినప్పుడే గుడి తేలుతుంది. సోమశిల నుంచి బోట్లు తిప్పకపోవడంతో దేవుని దర్శించుకోలేకపోతున్నాం. వెళ్లాలంటే కర్నూల్, నందికొట్కూరు, ఆత్మకూరు మీదుగా ప్రయాణం చేయాలి. కొల్లాపూర్ నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి 150 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సివస్తోంది. ఈ సమస్యకు అధికారులే త్వరగా పరిష్కారం చూపాలి.

– సురేందర్‌రావు, ఎన్మన్‌బెట్ల

వారి వల్ల ప్రజలకు ఇబ్బందులు..



సోమశిల–సిద్దేశ్వరం ఘాట్ల నిర్వాహకుల వల్ల కొల్లాపూర్, రాయలసీమ ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. నంద్యాల జిల్లాలోని కపిలేశ్వరం, మాడుగుల, ఎర్రమఠం, ముసలిమడుగు, సింగరాజుపల్లె, శివపురం గ్రామస్తులు మరబోట్లలో కొల్లాపూర్ నియోజకవర్గానికి రాకపోకలు సాగిస్తుంటారు. బంధువులను కలిసేందుకు, ఆలయాలకు, ఇతర వ్యాపారాల కోసం వచ్చేవారు. ఇప్పుడు కుదరడం లేదు. ఘాట్ల నిర్వాహకుల వల్ల ప్రజలకు ఇబ్బంది ఏర్పడింది. రాజీమార్గంలో వెళితే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

– చంద్రశేఖర్, శివపురం సర్పంచ్, నంద్యాల జిల్లా

రంగుల కరుణాకర్

- గురువు లేకుండానే పెయింటింగ్‌లో రాణిస్తున్న యువకుడు
- చూపరులను ఆకట్టుకుంటున్న చిత్రాలు



జడ్చర్ల టౌన్: ఎవరి వద్ద శిక్షణ పొందకుండా తనంతట తానే స్వతహాగా నేర్చుకొని పెయింటింగ్‌లో రాణిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు కల్వకుర్తికి చెందిన కరుణాకర్. ఈయన పట్టణంలోని డా. బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ (హెచ్‌ఈపీ) ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. కల్వకుర్తిలో 4వ తరగతి చదువుతున్న సమయంలో ఉపాధ్యాయుడు వేసిన పెయింటింగ్ అతడిలో ఆసక్తిని పెంచింది. అలాంటి బొమ్మలు తానుకూడా వేయాలని ఆనాడే లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి చిన్న చిన్న బొమ్మలు వేస్తున్నారు. ఇదే క్రమంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో సీటు రావటంతో జడ్చర్లకు వచ్చారు. తాను వేసిన పెయింటింగ్స్‌ను వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేయడంతో తనలోని టాలెంట్ వెలుగు చూసింది. ఎవరి వద్ద శిక్షణ పొందకుండా తనంతట తానుగా బొమ్మలు వేయటం నేర్చుకున్నారు. ప్రధానంగా పెన్సిల్ స్కెచ్, ఆయిల్ పెయింటింగ్, కోల్ పెయింటింగ్‌లో తర్ఫీదు పొందారు. తోటి విద్యార్థులను సైతం అతడు వేసిన పెయింటింగ్స్ ఎంతో ఆకట్టుకున్నాయి. అతడు వేసిన ఓ పెయింటింగ్ చూసిన అధ్యాపకురాలు డా. సుభాషిణి చూసి నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించిన పెయింటింగ్ పోటీలకు తీసుకువెళ్లింది. అక్కడకు వెళ్లాక పోటీల్లో పాల్గొనకుండా కరుణాకర్ బయటే ఉండిపోగా.. అధ్యాపకురాలు అతడిని ఒప్పించి చివరి 15 నిమిషాల ముందు పోటీల్లో పాల్గొనేలా చేసింది. ఆ 15 నిమిషాల్లో కరుణాకర్ రాధాకృష్ణుల పెయింటింగ్ వేసి అందరిని అబ్బురపర్చారు. అతడు వేసిన రాధాకృష్ణుల చిత్రానికి యూనివర్సిటీ స్థాయిలో మొదటి బహుమతి దక్కింది. అప్పటి నుంచి కరుణాకర్ పెయింటింగ్ కళ అందరికి తెలిసిపోయింది. ఒక్కో ఫోటోకు రూ.3 వేలు తీసుకుంటూ అద్భుత చిత్రాలను గీసి ఇస్తున్నారు. ఇతడి ప్రతిభ ఆధారంగా మద్రాస్ ఫైన్‌ఆర్ట్స్ కళాశాలలో సీటు వచ్చింది. కొచ్చిలో నేషనల్ ఎయిర్‌ఫోర్స్ కళాశాలలోనూ సీటు వచ్చింది. తాను కూడా పికాసో చిత్రంలా చరిత్రలో నిలిచిపోయే చిత్రం వేయాలని ఉందని కరుణాకర్ చెబుతున్నారు.



కరుణాకర్ వేసిన చిత్రాలు..

జాతీయ స్థాయి రెజ్లింగ్‌కు ధన్వాడ విద్యార్థినులు



గీత



నాగలక్ష్మి

ధన్వాడ: మండలంలోని కస్తుర్బా గాంధీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు గీత 9వ తరగతి, నాగలక్ష్మి ఇంటర్ మొదటి సంవత్సరం జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ శ్రీనివాసులు తెలియజేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు కొనసాగిన జాతీయ స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో(49 కిలోల విభాగంలో) గీత, నాగలక్ష్మి (57 కిలోల విభాగంలో) ఖేలో ఇండియాకు సెలక్ట్ అయ్యారు. అలాగే జాతీయ స్థాయి రెజ్లింగ్‌లో టాప్ టెన్ లిస్టులో గీత(29 కిలోల విభాగంలో) నాలుగో స్థానం, నాగలక్ష్మి 8వ స్థానంలో నిలిచారు. వీరు వచ్చే నెల ఆసియన్ చాంపియన్‌షిప్ ట్రాయల్‌లో పాల్గొంటారని వివరించారు.

పిడుగుపడి గడ్డివాము దగ్ధం

నవాబుపేట: మండల పరిధిలోని చాకలపల్లి గ్రామంలో పిడుగుపడి గడ్డివాము దగ్ధమైంది. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన హరిజన్ పెంటయ్య తన మూడు ఎకరాల వరి పంట కోసి పశువులకు మేత కోసం పొలం వద్ద గడ్డివాము ఏర్పాటు చేసుకున్నాడు. కాగా శనివారం తెల్లవారుజామున పిడుగులతో కూడిన అకాలవర్షం కురిసింది. పెంటయ్య పొలంలోని గడ్డివాముపై పిడుగుపడటంతో దాదాపుగా రూ.50వేల విలువ గల పశుగ్రాసం కాలి బూడిదైంది. తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీ

- నగదు, బంగారం అపహరణ



మొల్గరలో విచారణ చేస్తున్న ఎస్‌ఐ శేఖర్‌గౌడ్

ఉప్పునుంతల: మండలంలోని మొల్గరలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు విరగొట్టి రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. కొంత బంగారం, నగదు దోచుకెళ్లారు. గ్రామానికి చెందిన ఒంటరి మహిళ కుమ్మరి బక్కమ్మ పది రోజుల కిందట ఇంటికి తాళం వేసి, కుమార్తె బాలమణి వద్దకు పండుగులకి వెళ్లి అక్కడే ఉంది. దీంతో దొంగలు ఇంట్లోని రూ.20 వేల నగదు, తులంపావు బంగారు ఆభరణాలు దొంగిలించారు. అదేవిధంగా పక్కనే ఉన్న కుమ్మరి నిరంజన్ ఇంటి తాళాలు విరగొట్టి బీరువాలోని రూ.10 వేలు అపహరించినట్లు బాధితుడు తెలిపాడు. ఇంటికి తాళం వేసి నిరంజన్ తమ బంధువుల ఇంటికి కల్వకుర్తికి వెళ్లాడు. దొంగలు రెండు తాళాలు వేసిన ఇళ్లను ఎంచుకుని చోరీకి పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ శనివారం ఉదయం గ్రామానికి వెళ్లి విచారించారు. చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి గ్రామస్తులతో వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలు బక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

నిర్మాణంలో ఉన్న ఇంట్లో చోరీకి యత్నం

- నిందితులంతా మైనర్లే.. పోలీసులకు అప్పగింత

గద్వాల క్రైం: కొందరు మైనర్లు నిర్మాణంలో ఉన్న ఇంటిలో కాపర్ వైరు, నిర్మాణ సామగ్రిని దొంగిలించేందుకు యత్నించగా యజమాని పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌చార్జ్ రూరల్ ఎస్‌ఐ ఆనంద్ కథనం మేరకు.. నర్సింహులు అనే వ్యక్తి పట్టణంలోని రెండో రైల్వేగేట్ బీరెల్లి రోడ్డులో ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకోసం కాపర్ వైరు, సామగ్రి తెచ్చి ఇంట్లో ఉంచగా కొందరు మైనర్లు దొంగిలించేందుకు యత్నించారు. గుర్తించిన యజమాని పట్టుకొని అప్పగించడంతో విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు. వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు.

లీకేజీతో పాతాళగంగలా ఎగిసిపడి..



కోడేరు మండలం రాజాపూర్ సమీపంలో మిషన్ భగీరథ గేల్‌వాల్వ్‌కు లీకేజీ..

తాగునీటి పైపు లీకేజీతో నీరు ఉధృతంగా ఎగజిమ్మాయి. భారీ ప్రెషర్‌తో నీరు ఉప్పొంగడంతో పరిసర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మహబూబ్‌నగర్ పట్టణం పరిధిలోని ధర్మాపూర్–బండమీదిపల్లి మధ్య (రాయచూర్ రోడ్డు)లో మెయిన్ పైప్‌లైన్ నీటి ఉధృతికి పగిలిపోయింది. రెండు గంటల పాటు పెద్ద ఫౌంటెయిన్‌లా 50–60 అడుగుల మేర పైకి నీరు విరజిమ్మింది. మున్సిపల్ ఏఈ పృథ్వీ అక్కడికి చేరుకొని నీటి సరఫరాను నిలివేయించారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్ సమీపంలో రహదారి పక్కన మిషన్ భగీరథ గేల్‌వాల్వ్ వద్ద లీకేజీ ఏర్పడడంతో దాదాపు 30 అడుగుల మేర పాతాళగంగలా నీరు ఎగిసిపడింది. దాదాపు గంటసేపు నీరు వృథాగా పోవడంతో చుట్టు పక్కల రైతులు చూసి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులకు సమాచారం ఇవ్వడంతో నీటి సరఫరాను నిలిపివేశారు.

– మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/ కోడేరు (కొల్లాపూర్)



మహబూబ్‌నగర్ సమీపంలో పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీ

క్లుప్తంగా

పిడుగుపాటుకు గురై రైతు మృతి



హనుమంతు(ఫైల్)

గట్టు: మండల పరిధిలోని సల్కాపురంలో వర్ష సూచన లేకపోవడంతో గ్రామానికి చెందిన హనుమంతు శుక్రవారం వరిమడి కోశాడు. వడ్లను పొలంలోనే రాసి పోసి సాయంత్రానికి ఇంటికి చేరుకున్నాడు. ఉన్నట్లుండి అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. దీంతో వడ్ల రాసి తడవకుండా కవర్లు కప్పుదామని కుమారుడు తిమ్మప్పతో కలిసి టార్పాలిన్లు(బరకాలను) తీసుకుని వ్యవసాయ పొలానికి పరిగెత్తాడు. వడ్ల రాసిపై కవర్లు కప్పుతున్న క్రమంలో అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో పిడుగుపాటుకు గురై బోయ హనుమంతు(45) అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. కుమారుడు మాత్రం తృటిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ సంఘటనపై మృతుని భార్య ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలియజేశారు.

పండుగకు ఇంటికి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తకోట: కుటుంబసభ్యులతో రంజాన్ పండుగ కోసం స్వగ్రామానికి వస్తుండగా.. రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలానికి చెందిన షేక్ యూసుఫ్ బాషా (37) కొంత కాలంలో హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. కుటుంబసభ్యులతో రంజాన్ పండుగ జరుపుకునేందుకు శుక్రవారం రాత్రి బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. కాగా.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై వెనక నుంచి వచ్చిన ఓ కారు అతివేగంగా బైక్‌ను ఢీ కొట్టడంతో షేక్ యూసుఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతన్ని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ మృత్యువాతపడ్డాడు. మృతుడి సోదరుడు షేక్ ఉస్మాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడం జరిగిందని తమ్ముడు షేక్ ఉస్మాన్ పిర్యాధు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

పాము కాటుకు యువతి..

మక్తల్: మండలంలోని పంచలింగాలలో శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కంసాలి స్వప్న(22)ను పాముకాటు వేయడంతో వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం 11 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలియజేశారు.

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

లింగాల: మండలంలోని పద్మన్నపల్లికి చెందిన రాయ గణేష్(20) నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గణేష్‌ను ఈ నెల 19న ఇంటి దగ్గర తండ్రి మందలించడంతో క్షణికావేశంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే 108 వాహనంలో అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రెడ్డిగూడకాలనీకి చెందిన రైతు..

మిడ్జిల్: మండలంలోని చిల్వేర్ గ్రామపంచాయతిలోని రెడ్డిగూడకాలనీకి చెందిన రైతు పోతిరెడ్డి రవికుమార్‌రెడ్డి (45) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై శుక్రవారం పురుగుమందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ తెలిపారు. భార్య శౌరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శుక్రవారం మృతిచెందాడని సీఐ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం మరికల్ శివారులోని ఇందిరానగర్‌తండాకు చెందిన మూడావత్ తార్యా (72) శుక్రవారం మోపెడ్‌పై జడ్చర్లకు వస్తుండగా నాగసాల శివారులో అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తార్యాను వెంటనే 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి.. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుమార్తె వడ్యావత్ బిక్క శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.



సెమీస్‌లో ఓడిన సాకేత్‌-యూకీ జోడీ

బీఎండబ్ల్యూ ఓపెన్‌ ఏటీపీ-250 టెన్నిస్‌ టోర్నీలో సాకేత్‌ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్‌) పోరాటం ముగిసింది. జర్మనీలోని మ్యూనిక్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్‌ సెమీఫైనల్లో సాకేత్‌-యూకీ జంటకు ఓటమి ఎదురైంది. 84 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాకేత్‌-యూకీ 6-7 (4/7), 3-6తో అలెగ్జాండర్‌ ఎర్లెర్‌-లుకాస్‌ మీడ్లెర్‌ (ఆస్ట్రియా) చేతిలో ఓడిపోయారు. మ్యాచ్‌ మొత్తంలో ఐదు ఏస్‌లు సంధించిన సాకేత్‌, యూకీ ఐదు డబుల్‌ ఫాల్ట్‌లు కూడా చేయడం గమనార్హం. భారత జోడీ ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్‌ చేసి తమ సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయింది. సెమీస్‌లో ఓడిన సాకేత్‌-యూకీలకు 9,330 యూరోల (రూ. 8 లక్షల 47 వేలు)ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్‌ పాయింట్లు లభించాయి.

సురేఖ 'డబుల్‌' ధమాకా



ప్రపంచకప్‌ ఆర్చరీ టోర్నీలో రెండు స్వర్ణ పతకాలు నెగ్గిన ఆంధ్రప్రదేశ్‌ అమ్మాయి

స్వర్ణాలు సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. నా అనుభూతిని మాటల్లో వర్ణించలేను. నేనీ స్థాయికి చేరుకోవడానికి ఎంతో మంది కృషి ఉంది. వారందరికీ ధన్యవాదాలు. ఈ సీజన్‌లో మరో మూడు ప్రపంచకప్‌లు, ప్రపంచకప్‌ ఫైనల్స్‌, ప్రపంచ చాంపియన్‌షిప్‌, ఆసియా క్రీడలు ఉన్నాయి. ఈ మెగా ఈవెంట్స్‌లోనూ పతకాలు సాధించడమే నా లక్ష్యం. - సురేఖ

2 ప్రపంచకప్‌ టోర్నీ వ్యక్తిగత విభాగంలో సురేఖ సాధించిన పతకాలు. 2022లో సురేఖ రజతం నెగ్గగా, ఈసారి స్వర్ణం సాధించింది.

11 ప్రపంచకప్‌ టోర్నీలలో ఓవరాల్‌గా సురేఖ నెగ్గిన పతకాలు. ఇందులో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, నాలుగు కాంస్యాలు ఉన్నాయి.

2 ప్రపంచకప్‌ టోర్నీల్లో మిక్స్‌డ్‌ టీమ్‌లో సురేఖ నెగ్గిన స్వర్ణాలు. 2022లో అభిషేక్‌ వర్మతో కలిసి తొలిసారి స్వర్ణం గెలిచింది.



అంటాల్యా (తుర్కియే): ఆద్యంతం నిలకడగా రాణించిన భారత స్టార్‌ ఆర్చర్‌, ఆంధ్రప్రదేశ్‌ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ తన కెరీర్‌లో గొప్ప ప్రదర్శన చేసింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ... ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్‌ టోర్నీ వ్యక్తిగత స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఈవెంట్స్‌లో విజయవాడకు చెందిన 26 ఏళ్ల జ్యోతి సురేఖ గురి తప్పని లక్ష్యంతో మెరిపించి ఏకంగా రెండు స్వర్ణ పతకాలను దక్కించుకొని డబుల్‌ ధమాకా సృష్టించింది. ముందుగా కాంపౌండ్‌ మిక్స్‌డ్‌ టీమ్‌ విభాగంలో తొలిసారి ప్రపంచకప్‌ టోర్నీలో ఆడుతున్న ఓజస్‌ ప్రవీణ్‌ దేవ్‌తలె (మహారాష్ట్ర)తో కలిసి పసిడి పతకాన్ని సాధించింది. చెన్‌ యి సువాన్‌-చెన్‌ చి లున్‌ (చైనీస్‌ తైపీ) జోడీతో జరిగిన ఫైనల్లో జ్యోతి సురేఖ-ఓజస్‌ ప్రవీణ్‌ 159-154 పాయింట్ల తేడాతో గెలిచింది. తొలి మూడు రౌండ్‌లలో 40కి 40 పాయింట్లు స్కోరు చేసిన భారత జోడీ చివరి రౌండ్‌లో 39 పాయింట్లు సాధించింది. ఒక పాయింట్‌ తేడాతో ప్రపంచ రికార్డును సమం చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 2018లో అంటాల్యాలోనే జరిగిన ప్రపంచకప్‌లో దక్షిణ కొరియా జట్టు 160కి 160 పాయింట్లు స్కోరు చేసింది.

వరల్డ్‌ నంబర్‌వన్‌ను ఓడించి...

మహిళల కాంపౌండ్‌ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ ప్రపంచకప్‌ టోర్నీల చరిత్రలో తొలిసారి పసిడి పతకాన్ని ముద్దాడింది. శనివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్‌ సురేఖ 149-146తో (30-30, 30-29, 29-29, 30-29, 30-29) ప్రపంచ మూడో ర్యాంకర్‌ సారా లోపెజ్‌ (కొలంబియా)పై గెలిచి 20వ ప్రయత్నంలో చాంపియన్‌గా అవతరించింది. 2011 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సురేఖ సెమీఫైనల్లో 148-146తో (29-29, 30-30, 30-30, 29-29, 30-28) ప్రపంచ నంబర్‌వన్‌ ఇలా గిబ్సన్‌ (బ్రిటన్‌)పై సంచలన విజయం సాధించింది.

లక్నో చేజేతులా...

గెలిచే దారిలో ఓటమిని పిలవడం అంటే ఇదే! 19 ఓవర్లలో లక్నో స్కోరు 124/3. ఇంకా 7 వికెట్లున్న జట్టు 6 బంతుల్లో 12 పరుగులు చేస్తే చాలు. పైగా తొలి ఓవర్‌ నుంచి ఆడుతున్న ఓపెనర్‌ కేఎల్‌ రాహుల్‌ అర్ధసెంచరీ చేసి క్రీజులో ఉన్నాడు. ఆఖరి ఓవర్‌ మొదటి బంతికి 2 పరుగులు కూడా చేశాడు. 5 బంతుల్లో 10 పరుగులు సులభంగానే కనిపించింది. కానీ మోహిత్‌ శర్మ వేసిన తర్వాతి 2 బంతులు రాహుల్‌, స్టొయినిస్‌లను బోల్తా కొట్టించాయి. ఇంకో 2 బంతులకు ఆయుశ్‌ బదోని, దీపక్‌ హుడా రనౌటయ్యారు. అంతే ఆఖరి బంతి మిగిలుంది కానీ... టైటాన్స్‌ గెలిచింది! సమీకరణం 1 బంతికి 8 పరుగులు కాగా... మోహిత్‌ కనీసం ఒక పరుగైనా ఇవ్వలేదు. దీంతో ఎవరూహించని విజయం గుజరాత్‌ గూటికి చేరింది.



ఆయుశ్‌ బదోనిని రనౌట్‌ చేస్తున్న మోహిత్‌ శర్మ

- నెగ్గాల్సిన మ్యాచ్‌లో 7 పరుగులతో ఓటమి
- ఆఖరి ఓవర్లో గుజరాత్‌ను గెలిపించిన మోహిత్‌
- రాహుల్‌ శ్రమ వృథా
- రాణించిన పాండ్యా, సాహా

లక్నో: మోహిత్‌ శర్మ స్వింగ్‌ (2/17)తో గుజరాత్‌ టైటాన్స్‌ కింగ్‌ అయ్యింది. అనూహ్యంగా ఓటమి కోరల్లోంచి గెలుపు మజిలీకి చేరింది. అలవోకగా గెలవాల్సిన చోట లక్నో సూపర్‌ జెయింట్స్‌ వరుస నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు చేజార్చుకొని ఓటమిని పలకరించింది. మొదట గుజరాత్‌ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. కెప్టెన్‌ హార్దిక్‌ పాండ్యా (50 బంతుల్లో 66; 2 ఫోర్లు, 4 సిక్సర్లు), వృద్ధిమాన్‌ సాహా (37 బంతుల్లో 47; 6 ఫోర్లు) రాణించారు. లక్నో బౌలర్లలో కృనాల్‌ పాండ్యా, స్టొయినిస్‌ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన లక్నో సూపర్‌ జెయింట్స్‌ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 128 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్‌ కేఎల్‌ రాహుల్‌ (61 బంతుల్లో 68; 8 ఫోర్లు) పోరాటం జట్టును గెలిపించలేకపోయింది. మోహిత్‌ శర్మకు 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' లభించింది.

కెప్టెన్‌ ఇన్నింగ్స్‌...

సాహాతో శుబ్‌మన్‌ గిల్‌ (0) 'ఇంపాక్ట్‌' డకౌటైంది. వన్‌డౌన్‌లో కెప్టెన్‌ హార్దిక్‌ పాండ్యా అండతో సాహా బౌండరీలతో టైటాన్స్‌ స్కోరును కదిలించాడు. ఈ జోడీ పవర్‌ప్లేలో 40 పరుగులు చేసింది. ఆ తర్వాత అడపాదడపా ఫోర్లతో 10 ఓవర్ల దాకా వికెట్‌ను కాపాడుకున్నారు. జట్టు స్కోరు 72 వద్ద సాహాను కృనాల్‌ పాండ్యా అవుట్‌ చేయగా... తర్వాత వచ్చిన అభినవ్‌ (3), విజయ్‌ శంకర్‌ (10) నిరాశపరచడంతో పెద్ద స్కోరేం కాలేదు. ఆఖరి ఓవర్లలో హార్దిక్‌ భారీ సిక్సర్లతో స్కోరు పెంచే ప్రయత్నం చేశాడు. 44 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న పాండ్యా ఆఖరి ఓవర్లో నిష్క్రమించాడు.



కేఎల్‌ రాహుల్‌

రాహుల్‌ ఒంటరి పోరాటం...

లక్నో ముందున్న లక్ష్యం 136 పరుగులు. కష్టమైందో... కఠినమైందో కానే కాదు! ఓపెనింగ్‌ జోడీ కెప్టెన్‌ రాహుల్‌, కైల్‌ మేయర్స్‌ (19 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్‌) పవర్‌ ప్లేలోనే 53 పరుగులు చేయడంతో లక్ష్యఛేదన సులువుగా సాగింది. మేయర్స్‌ తర్వాత కృనాల్‌ పాండ్యా (23 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్‌) అవుటయ్యేసరికే జట్టు 100 పరుగులను దాటింది. నికోలస్‌ పూరన్‌ (1) విఫలమైనా... రాహుల్‌ క్రీజును అట్టిపెట్టుకోవడంతో ఎవరికీ ఏ బెంగా లేదు. రాహుల్‌ 38 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. ఆఖరి ఓవర్‌కు ముందు 124/3 స్కోరుతో లక్నో పటిష్టంగా ఉంది. కానీ ఆ తర్వాతే మోహిత్‌ చివరి ఓవర్‌ అనూహ్యంగా సూపర్‌ జెయింట్స్‌ను ఓడించింది. కచ్చితత్వం లేని షాట్లతో రాహుల్‌, స్టొయినిస్‌ (0)వికెట్లను పారేసుకుంటే... పరుగుల వేటలో ఆయుశ్‌ బదోని (8), దీపక్‌ హుడా (2) రనౌటయ్యారు.

స్కోరు వివరాలు

గుజరాత్‌ టైటాన్స్‌ ఇన్నింగ్స్‌: సాహా (సి) హుడా (బి) కృనాల్‌ 47; గిల్‌ (సి) బిష్ణోయ్‌ (బి) కృనాల్‌ 0; హార్దిక్‌ పాండ్యా (సి) రాహుల్‌ (బి) స్టొయినిస్‌ 66; అభినవ్‌ (సి) నవీనుల్‌ హఖ్‌ (బి) మిశ్రా 3; విజయ్‌ శంకర్‌ (బి) నవీనుల్‌ హఖ్‌ 10; మిల్లర్‌ (సి) హుడా (బి) స్టొయినిస్‌ 6; తెవాటియా (నాటౌట్‌) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 135. వికెట్ల పతనం:** 1-4, 2-72, 3-77, 4-92, 5-132, 6-135. **బౌలింగ్‌:** నవీనుల్‌ హఖ్‌ 4-0-19-1, కృనాల్‌ పాండ్యా 4-0-16-2, అవేశ్‌ ఖాన్‌ 3-0-21-0, రవి బిష్ణోయ్‌ 4-0-49-0, స్టొయినిస్‌ 3-0-20-2, అమిత్‌ మిశ్రా 2-0-9-1.

లక్నో సూపర్‌ జెయింట్స్‌ ఇన్నింగ్స్‌: రాహుల్‌ (సి) జయంత్‌ (బి) మోహిత్‌ 68; మేయర్స్‌ (బి) రషీద్‌ ఖాన్‌ 24; కృనాల్‌ (స్టంప్డ్‌) సాహా (బి) నూర్‌ అహ్మద్‌ 23; పూరన్‌ (సి) హార్దిక్‌ (బి) నూర్‌ అహ్మద్‌ 1; బదోని (రనౌట్‌) 8; స్టొయినిస్‌ (సి) మిల్లర్‌ (బి) మోహిత్‌ 0; దీపక్‌ హుడా (రనౌట్‌) 2; ప్రేరక్‌ మన్కడ్‌ (నాటౌట్‌) 0; రవి బిష్ణోయ్‌ (నాటౌట్‌) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1-55, 2-106, 3-110, 4-126, 5-126, 6-127, 7-128. **బౌలింగ్‌:** షమీ 3-1-18-0, జయంత్‌ 4-0-26-0, రషీద్‌ ఖాన్‌ 4-0-33-1, మోహిత్‌ శర్మ 3-0-17-2, నూర్‌ అహ్మద్‌ 4-0-18-2, హార్దిక్‌ పాండ్యా 1-0-7-0, రాహుల్‌ తెవాటియా 1-0-8-0.

మెరుపుల్లో పంజాబ్‌దే గెలుపు



స్యామ్‌ కరన్‌

- అదరగొట్టిన స్యామ్‌ కరన్‌, హర్‌ప్రీత్‌
- కీలక వికెట్లు తీసిన అర్ష్‌దీప్‌
- 13 పరుగులతో ముంబైపై పంజాబ్‌ కింగ్స్‌ గెలుపు
- గ్రీన్‌, సూర్యకుమార్‌ శ్రమ వృథా

ముంబై: మెరుపుల ప్రతాపంలో పంజాబ్‌ కింగ్స్‌ పైచేయి సాధించింది. 13 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత పంజాబ్‌ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. కెప్టెన్‌ 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' స్యామ్‌ కరన్‌ (29 బంతుల్లో 55; 5 ఫోర్లు, 4 సిక్సర్లు), హర్‌ప్రీత్‌ సింగ్‌ (28 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. జితేశ్‌ శర్మ (7 బంతుల్లో 25; 4 సిక్సర్లు) ఆఖర్లో శివమెత్తాడు. గ్రీన్‌, పియూష్‌ చావ్లా రెండేసి వికెట్లు తీశారు. తర్వాత భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 201 పరుగులకు పరిమితమైంది. గ్రీన్‌ (43 బంతుల్లో 67; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), సూర్యకుమార్‌ (26 బంతుల్లో 57; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్‌ శర్మ (27 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), టిమ్‌ డేవిడ్‌ (13 బంతుల్లో 25 నాటౌట్‌; 2 సిక్స్‌లు) చెలరేగారు. కానీ ఆఖరి ఓవర్‌ ఫినిషింగ్‌లో అర్ష్‌దీప్‌ (4/29) నిప్పులు చెరగడంతో ముంబై విజయానికి దూరమైంది. ముంబై గెలుపునకు ఆఖరి ఓవర్లో 16 పరుగులు కావాల్సి ఉండగా... అర్ష్‌దీప్‌ 2 పరుగులే ఇచ్చి తిలక్‌ వర్మ (3), నేహల్‌ వధేరా (0) వికెట్లను విరిచేశాడు.



అర్ష్‌దీప్‌

స్కోరు వివరాలు

పంజాబ్‌ కింగ్స్‌ ఇన్నింగ్స్‌: షార్ట్‌ (సి) చావ్లా (బి) గ్రీన్‌ 11; ప్రభ్‌సిమ్రన్‌ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్జున్‌ 26; అథర్వ (బి) చావ్లా 29; లివింగ్‌స్టోన్‌ (స్టంప్డ్‌) కిషన్‌ (బి) చావ్లా 10; హర్‌ప్రీత్‌ (బి) గ్రీన్‌ 41; కరన్‌ (సి అండ్‌ బి) ఆర్చర్‌ 55; జితేశ్‌ (బి) బెహ్రెన్‌డార్ఫ్‌ 25; షారుక్‌ నాటౌట్‌ 0; హర్‌ప్రీత్‌ బ్రార్‌ రనౌట్‌ 5; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-18, 2-65, 3-82, 4-83, 5-175, 6-197, 7-209, 8-214. **బౌలింగ్‌:** అర్జున్‌ టెండూల్కర్‌ 3-0-48-1, బెహ్రెన్‌డార్ఫ్‌ 3-0-41-1, గ్రీన్‌ 4-0-41-2, ఆర్చర్‌ 4-0-42-1, పీయూష్‌ చావ్లా 3-0-15-2, హృతిక్‌ షోకీన్‌ 3-0-24-0.

ముంబై ఇండియన్స్‌ ఇన్నింగ్స్‌: రోహిత్‌ శర్మ (సి అండ్‌ బి) లివింగ్‌స్టోన్‌ 44; ఇషాన్‌ కిషన్‌ (సి) షార్ట్‌ (బి) అర్ష్‌దీప్‌ సింగ్‌ 1; గ్రీన్‌ (సి) స్యామ్‌ కరన్‌ (బి) ఎలిస్‌ 67; సూర్యకుమార్‌ యాదవ్‌ (సి) అథర్వ (బి) అర్ష్‌దీప్‌ 57; టిమ్‌ డేవిడ్‌ (నాటౌట్‌) 25; తిలక్‌వర్మ (బి) అర్ష్‌దీప్‌ సింగ్‌ 3; నేహల్‌ వధేరా (బి) అర్ష్‌దీప్‌ సింగ్‌ 0; ఆర్చర్‌ (నాటౌట్‌) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-8, 2-84, 3-159, 4-182, 5-200, 6-200. **బౌలింగ్‌:** షార్ట్‌ 1-0-7-0, అర్ష్‌దీప్‌ 4-0-29-4, హర్‌ప్రీత్‌ బ్రార్‌ 2-0-15-0, స్యామ్‌ కరన్‌ 3-0-41-0, ఎలిస్‌ 4-0-44-1, రాహుల్‌ చహర్‌ 4-0-42-0, లివింగ్‌స్టోన్‌ 2-0-23-1.

ఐపీఎల్‌ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్‌	6	4	2	8	1.043
లక్నో	7	4	3	8	0.547
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్‌	6	4	2	8	0.212
పంజాబ్‌	7	4	3	8	-0.162
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్‌	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్‌: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్‌ రన్‌రేట్‌

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x రాజస్తాన్‌ (మ. గం. 3:30 నుంచి)
కోల్‌కతా x చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్‌ స్పోర్ట్స్‌, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

'కొటక్‌-పుల్లెల గోపీచంద్‌ అకాడమీ' ప్రారంభం



గచ్చిబౌలి: బ్యాడ్మింటన్‌ క్రీడాకారులకు మరో శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. శనివారం గచ్చిబౌలిలో కొటక్‌ మహీంద్ర బ్యాంక్‌ లిమిటెడ్‌ సీఎస్‌ఆర్‌ అసోసియేట్‌, పుల్లెల గోపీచంద్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో 'కొటక్‌-పుల్లెల గోపీచంద్‌ అకాడమీ'ని ప్రారంభించారు. ఈ అకాడమీని అత్యాధునిక మౌలిక వసతులు, అంతర్జాతీయ కోచ్‌లతో ప్రపంచస్థాయి బ్యాడ్మింటన్‌ శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతామని... ప్రోత్సాహిక, అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇస్తామని జాతీయ చీఫ్‌ కోచ్‌ గోపీచంద్‌ వ్యాఖ్యానించారు. కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్‌)లో భాగంగా కొటక్‌ మహీంద్ర బ్యాంక్‌ భారతీయ బ్యాడ్మింటన్‌ క్రీడాకారులకు ప్రపంచస్థాయి శిక్షణ సౌకర్యాన్ని అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తుందన్నారు. యువత భవిష్యత్‌ కోసం క్రీడా మౌలిక వసతులు అందించేందుకు గోపీచంద్‌ అకాడమీతో కలిసి పనిచేస్తామని కొటక్‌ మహీంద్ర బ్యాంక్‌ హోల్‌ టైమ్‌ డైరెక్టర్‌ శాంతి ఏకాంబరం పేర్కొన్నారు. కొటక్‌-పుల్లెల గోపీచంద్‌ బ్యాడ్మింటన్‌ శిక్షణ కేంద్రంలో అత్యుత్తమ నాణ్యత గల న్యూట్రీషియనిస్టులు, ఫిజియోథెరపిస్టులు, నిపుణులతో కూడిన స్పోర్ట్స్‌ సైన్స్‌ సెంటర్‌ ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడిన కోచ్‌లు, క్రీడాకారుల కోసం ఫెలోషిప్‌ ప్రోగ్రామ్‌, బ్యాడ్మింటన్‌ శిక్షణ పరిధిని విస్తరించేందుకు పూర్వ క్రీడాకారుల కోసం కోచ్‌ సర్టిఫికేషన్‌ ప్రోగ్రామ్‌ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కొటక్‌ మహీంద్ర గ్రూప్‌ ప్రెసిడెంట్‌, సీఎఫ్‌ఓ జైమిన్‌ భట్‌, ఆంధ్రప్రదేశ్‌ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, భారత షట్లర్లు సైనా నెహ్వాల్‌, సిక్కి రెడ్డి, శ్రీకాంత్‌, సాయిప్రణీత్‌, పుల్లెల గాయత్రి, ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్‌ అర్జున్‌



అస్తానా (కజకిస్తాన్‌): సాటీ జుల్దిజ్‌ ఓపెన్‌ అంతర్జాతీయ ర్యాపిడ్‌ చెస్‌ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్‌ ఇరిగేశి అర్జున్‌ చాంపియన్‌గా అవతరించాడు. శనివారం ముగిసిన ఈ టోర్నీలో అర్జున్‌ నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. శనివారం జరిగిన చివరి మూడు రౌండ్‌ గేముల్లో అర్జున్‌ రెండింటిలో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని ఈ టోర్నీని అజేయంగా ముగించాడు. క్రామ్నిక్‌ (రష్యా)తో జరిగిన తొమ్మిదో రౌండ్‌లో అర్జున్‌ 47 ఎత్తుల్లో గెలుపొందగా... అరోనియన్‌ (అమెరికా)తో జరిగిన పదో రౌండ్‌ను అర్జున్‌ 24 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన చివరిదైన 11వ రౌండ్‌ గేమ్‌లో అర్జున్‌ 58 ఎత్తుల్లో గెలిచాడు.

బోపన్న జోడీ ఓటమి

బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్‌ టెన్నిస్‌ టోర్నీ డబుల్స్‌ సెమీఫైనల్లో రోహన్‌ బోపన్న (భారత్‌)-ఎబ్డెన్‌ (ఆస్ట్రేలియా) ద్వయం 4-6, 5-7తో వెస్లీ కూలాఫ్‌ (నెదర్లాండ్స్‌)-నీల్‌ స్కుప్‌స్కీ (బ్రిటన్‌) జోడీ చేతిలో ఓడింది. బోపన్న జోడీకి 45,120 డాలర్ల (రూ. 37 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.

సినిమా

ఆ ఒక్క సెంటిమెంట్‌ ఫాలో అవుతున్నా! - అఖిల్‌

"30 ఏళ్లకు పైగా మా నాన్నగారు (నాగార్జున) ఇండస్ట్రీలో ఉన్నారు కాబట్టి ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ఆయనకు మంచి గ్రిప్‌ ఉంది. నాకేమైనా సందేహాలు ఉంటే ఆయన్ని అడిగి తెలుసుకుంటాను. అయితే ఫలానా స్క్రిప్ట్‌ ఓకే చేయలా? వద్దా అని అడగను. అలా చేస్తే నా కెరీర్‌ తాలూకు ఒత్తిడిని నాన్నపై పెట్టినట్లు ఉంటుంది. ఆయన ప్రమేయం ఎక్కువగా ఉంటే ఓ వ్యక్తిగా నేను ఎదగలేకపోవచ్చు. అందుకే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నాను. ఈ కారణంగానే 'ఏజెంట్‌' స్క్రిప్ట్‌ను నాన్నతో షేర్‌ చేయలేదు" అన్నారు అఖిల్‌. సురేందర్‌ రెడ్డి దర్శకత్వంలో అఖిల్‌ హీరోగా నటించిన చిత్రం 'ఏజెంట్‌'. అనిల్‌ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్‌ కానుంది. ఈ సందర్భంగా అఖిల్‌ చెప్పిన విశేషాలు.

- నాకు యాక్షన్‌ సినిమాలంటే చాలా ఇష్టం. నా గత చిత్రం 'మోస్ట్‌ ఎలిజిబుల్‌ బ్యాచ్‌లర్‌' టైమ్‌లో సూరిగారు (సురేందర్‌ రెడ్డి) 'ఏజెంట్‌' కథ చెప్పారు. నాకూ నచ్చింది. దాంతో వెంటనే అనౌన్స్‌ చేశాం. అయితే స్క్రిప్ట్‌ పూర్తి కావడానికి, నా లుక్‌ మార్చుకోవడం, లాక్‌డౌన్‌ వంటి వాటి వల్ల ఈ సినిమా ఆలస్యమైంది.
- 'ఏజెంట్‌'లో నేను రామకృష్ణ (రిక్కీ) అనే పాత్ర చేశాను. రిక్కీ పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. 'ఏజెంట్‌' ఒక మంచి స్పై డ్రామా. సురేందర్‌ రెడ్డిగారు ప్రతిదీ ఫైన్‌ ట్యూన్‌ చేస్తారు. నేను ఆయన్ను బ్లైండ్‌గా ఫాలో అయ్యాను. ఇక సెకండాఫ్‌లో వచ్చే టార్చర్‌ సీన్‌ కోసం చాలా కష్టపడ్డాను.
- సాధారణంగా నేను సెంటిమెంట్స్‌ను నమ్మను. అయితే ఏప్రిల్‌ 28న 'అడవి రాముడు', 'పోకిరి', 'బాహుబలి' వంటి ఎన్నో సక్సెస్‌ఫుల్‌ సినిమాలు విడుదలయ్యాయి. ఇలాంటి హిట్‌ సినిమాలు విడుదలైన ఏప్రిల్‌ 28న 'ఏజెంట్‌' సినిమా విడుదల అవుతోంది. ఈ సెంటిమెంట్‌ను మాత్రం ఫాలో అవుతున్నాను.
- నాన్నగారితో స్క్రీన్‌ షేర్‌ చేసుకోవడం అనేది నా కల. అది నాన్నగారి వందో సినిమా అయితే నాకు ఇంకా సంతోషం. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది. కానీ నాకు తెలిసి అలాంటి స్క్రిప్ట్‌ ఏదీ ఫైనలైజ్‌ కాలేదు. 'ఏజెంట్‌' సినిమా ట్రైలర్‌ చూసి, నేను చాలా కష్టపడ్డానని తెలిసి మా అమ్మగారు (అక్కినేని అమల) ఎమోషన్‌ అయ్యారు.




జై శ్రీరామ్‌.. జై శ్రీరామ్‌



ప్రభాస్‌

'నీ సాయం సదా మేమున్నాం.. సిద్ధం సర్వ సైన్యం.. సహచరులై పదా వస్తున్నాం. సఫలం స్వామి కార్యం' అంటూ 'జై శ్రీరామ్‌' నామం ప్రతిధ్వనించేలా 'ఆదిపురుష్‌' చిత్రం నుంచి ఓ లిరికల్‌ వీడియోను చిత్ర యూనిట్‌ విడుదల చేసింది. ప్రభాస్‌ టైటిల్‌ రోల్‌లో ఓం రౌత్‌ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆదిపురుష్‌'. శనివారం ఈ చిత్రం నుంచి 60 సెకన్ల 'జై శ్రీరామ్‌' పాట లిరికల్‌ వీడియోను రిలీజ్‌ చేశారు. అజయ్‌-అతుల్‌ స్వరపరిచిన ఈ గీతాన్ని హిందీ, తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేశారు. తెలుగులో రామజోగయ్య శాస్త్రి రాశారు. భూషణ్‌ కుమార్‌, క్రిషన్‌ కుమార్‌, ఓం రౌత్‌, ప్రసాద్‌ సుతార్‌, రాజేష్‌ నాయర్‌, వంశీ, ప్రమోద్‌ నిర్మించిన ఈ చిత్రం జూన్‌ 16న రిలీజ్‌ కానుంది.

ఐ హేట్‌ లవ్‌



సుధీర్‌బాబు

"దేవుడడిగాడంట.. నన్ను చేరడానికి ఏడు జన్మలు నాకు భక్తుల్లా బతుకుతారా...లేక మూడు జన్మలు రాక్షసుల్లా బతుకుతారా అని. ఏడు జన్మలు నీకు దూరంగా ఉండే కన్నా... మూడు జన్మల రాక్షస బతుకే మిన్న అని దేవతలే కోరుకున్నారట', 'ఐ హేట్‌ లవ్‌' అనే డైలాగ్స్‌తో విడుదలైంది 'మామా మశ్చీంద్ర' టీజర్‌. సుధీర్‌ బాబు హీరోగా హర్షవర్ధన్‌ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ చిత్రంలో మృణాళిని రవి, ఈషా రెబ్బా హీరోయిన్లు. సోనాలీ నారంగ్‌, సృష్టి సమర్పణలో సునీల్‌ నారంగ్‌, పుస్కూర్‌ రామ్మోహన్‌రావు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్‌ కానుంది. శనివారం ఈ సినిమా టీజర్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్‌ మీడియాలో షేర్‌ చేశారు. ఈ చిత్రంలో దుర్గ, డీజే, పరశురామ్‌ పాత్రలు చేశారు సుధీర్‌బాబు.

చైత్రతో ప్రేమ



ఇవానా, ఆశిష్‌

'రౌడీ బాయ్స్‌'తో ఆకట్టుకున్న ఆశిష్‌ రెడ్డి హీరోగా నటిస్తున్న రెండో చిత్రం 'సెల్ఫిష్‌'. కాశీ విశాల్‌ దర్శకత్వంలో సుకుమార్‌ రైటింగ్స్‌, 'దిల్‌' రాజు, శిరీష్‌ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఇవానా కథానాయిక. ఆమె పాత్ర పేరు చైత్ర. ఆందోళనగా ఉన్న చైత్రను హీరో తదేకంగా చూస్తున్న పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో జరిగే ఈ మాస్‌ లవ్‌స్టోరీలో ఆశిష్‌ ఓల్డ్‌ సిటీ కుర్రాడి పాత్ర చేస్తుండగా, ఇవానా ఫైనాన్షియల్‌ ఎనలిస్ట్‌ పాత్ర చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్‌ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె మేయర్‌, కెమెరా: ఎస్‌. మణికందన్‌, సహనిర్మాతలు: హర్షిత్‌ రెడ్డి, హన్షిత రెడ్డి, ఆశోక్‌ బండ్రెడ్డి.